


RNI No. TEL/TEL/2018/76342

# లోకంతీరు

LOKAMTEERU TELUGU DAILY సామాజిక, రాజకీయ దిన పత్రిక

ప్రచురణ : నిజామాబాద్ శుక్రవారం 23-08-2024 ఎడిటర్ : బ్యాగల్ శ్రీనివాస్ సంపుటి : 06 సంచిక : 222 పేజీలు : 4 వెల : రూ 2-00

PUBLISHED : NIZAMABAD FRIDAY 23 AUGUST 2024 EDITOR : BYAGAL SRINIVAS VOLUME : 06 ISSUE : 222 PAGES : 4 Rs : 2.00

## ప్రజాభవన్ వద్ద గురుకుల ఉపాధ్యాయుల ధర్నా

హైదరాబాద్,ఆగస్ట్23 : నిబంధనలకు విరుద్ధంగా తమను జోన్లు మారుస్తూ బదిలీల చేశారని ఆరోపిస్తూ రాష్ట్రంలోని గురుకుల ఉపాధ్యాయులు బుధవారం రాత్రి ప్రజాభవన్ వద్ద ధర్నాకు దిగారు. రాష్ట్రంలో ఒప్పంద విధానంలో పనిచేస్తున్న తమను 2023లో గత ప్రభుత్వం రెగ్యులర్ చేసిందని తెలిపారు. అయితే జులైలో తమనూ బదిలీ చేస్తు అధికారులు ఉత్తర్వులు ఇవ్వడంతో రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించగా సెప్టెంబరు దాకా కోర్టు స్టే ఇచ్చిందని తెలిపారు. ఇదిలా ఉండగా బుధవారం కౌన్సిలింగ్ పేరుతో గురుకుల కార్యదర్శి తమను పిలిపించి రాగానే బదిలీ గంటల వరకు కార్యాలయం వద్దనే బైఠాయించినా పట్టించుకోకుండా వెళ్లారు. దాంతో దిక్కుతోచని స్థితితో న్యాయంకోసం కోసం ప్రజాభవన్ వద్దకు రావాల్సి వచ్చిందని వాపోయారు. 317 జీవో ప్రకారం ఖమ్మం జోన్ నుంచి ఆదిలాబాద్ జోన్‌కు, చార్మినార్ నుంచి గద్వాల్‌కు జోన్లు మారుస్తూ బదిలీలు చేశారు.

# దేశానికి గుదిబండగా మోడీ ద్వయం

**అప్పులకుప్పగా మార్చి అనుయాయులకు పంపకం**
**దేశానికి రూ.183 లక్షల కోట్ల అప్పులు చేసి పెట్టారు.**
**పరివారాన్ని కాపాడుకునే పనిలోనే మోడీ**
**ఇడి కార్యాలయం ముందు ధర్నాలో సిఎం రేవంత్**
**బిఆర్ఎస్ ఉచ్చులో పడొద్దని రైతులకు సూచన**
**అందరికీ రుణమాఫీ చేస్తామని హామీ**



హైదరాబాద్,ఆగస్ట్23: అదానీ వ్యవహారాన్ని చట్టసభల్లో రాహుల్ గాంధీ బయటపెట్టారని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. కేంద్ర దర్యాప్తు సంస్థల్ని తమ గుప్పిట్లో పెట్టుకుని కొందరికే లబ్ధి చేకూరేలా వ్యవహరిస్తున్న ప్రధాని మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా విధానాలకు నిరసనగా దేశంలోని అన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కార్యాలయాల ఎదుట కాంగ్రెస్ పార్టీ గురువారం ఆందోళనలు నిర్వహించింది. ఇందులో భాగంగా హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నాలో సీఎం పాల్గొని మాట్లాడారు. 'దేశానికి రూ.183 లక్షల కోట్ల అప్పులున్నాయి. 16 మంది ప్రధానులు చేసిన అప్పుల కంటే నరేంద్ర మోదీ రెండింతలు ఎక్కువ చేశారు. మోదీ తన పరివారాన్ని కాపాడుకోవడానికి ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. దేశాన్ని మోదీ, అమిత్‌షా, అదానీ, అంబానీ చెరబట్టారు. సెబీ ఛైర్‌పర్సన్ అక్రమాలపై విచారణ జరపాలి. వర్సిటీలు, ప్రాజెక్టులను మొదలుపెట్టిన దార్శనిక ప్రధాని నెహ్రూ. ఇందిరా గాంధీ భూసంస్కరణలు ప్రవేశపెట్టి బలహీనవర్గాలకు భూములు పంచారు. రాజీవ్‌గాంధీ తెచ్చిన సాంకేతిక విప్లవం వల్లే ఐటీ అభివృద్ధి సాధ్యమైంది. ఇప్పుడు రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఉందని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఎడ్యుకేషన్, ఇరిగేషన్ మా ప్రయారిటీ అని నెహ్రు పరిపాలన సాగించారని, బ్యాంకులను రైతుల కోసం ఇందిరాగాంధీ జాతీయం చేశారని అన్నారు. పేదలకు భూములు ఇచ్చి ఇందిరాగాంధీ ఆత్మగౌరవం పెంచారని, సాంకేతిక రంగాన్ని పెంచి పోషించారు రాజీవ్ గాంధీ అని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. సాంకేతిక విప్లవం తెచ్చారు రాజీవ్ గాంధీ అని, పీవీ లాంటి ప్రధానులు దేశం కోసం ప్రణాళికలు రచించి దేశాన్ని ముందుకు నడిపించారన్నారు. స్వతంత్ర పోరాటం కోసం గుజరాత్ నుండి గాంధీ.. వల్లభాయ్ పటేల్ బయలుదేరారని, అదే గుజరాత్ నుండి.. మోడీ.. అమిత్ షా లు బయలు దేరారని, ఆ ఇద్దరినీ చూస్తే దేశం గర్విస్తుంది? ఈ ఇద్దరు దేశం సంపద లూటీ చేస్తున్నారన్నారు. అంతేకాకుండా..'బీఆర్ఎస్ సన్నాసులు ఈ విషయంలో బీజేపీ నీ ఎందుకు నిలదీయడం లేదన్నారు. . బీజేపీలో బీఆర్ఎస్ విలీనం అవుతుందో.. మలినం అవుతుందో వాళ్ళ ఇష్టం. కేసీఆర్ ఎందుకు బీజేపీ దోపిడీ మీద ఎందుకు స్పందించడం లేదు. ట్విట్టర్ టిల్లు ఎందుకు మాట్లాడరు. బీజేపీకి అనుకూలం కాబట్టే ఆయన స్పందించరు. జేసీసీ విషయంలో బీఆర్ఎస్ విధానం ఏంటి..? అమిత్ షా.. మోడీని మెప్పించడానికి రాజీవ్ గాంధీ విగ్రహం తీసేస్త అంటున్నారు. ఎయిర్ పోర్ట్ కి రాజీవ్ గాంధీ పేరు మారుస్తాం అంటున్నారు. చెయ్ వేసి చూడు.. వీపు పగలకొట్టక పోతే పేరు మార్చుకుంట. తెలంగాణకి తల్లి సోనియా గాంధీ. సచివాలయం బయట కాదు.. లోపల తెలంగాణ తల్లి విగ్రహం పెడతాం. పదేళ్లు ఈ సన్నాసులు ఎందుకు పెట్టలేదు తెలంగాణ తల్లి విగ్రహం. రైతుల ముసుగులో బీఆర్ఎస్ ధర్నాలు చేస్తోందని మ ండిపడ్డారు. ఏ రైతుకు మాఫీ కాకున్నా..కలక్టర్ కార్యాలయం లో కౌంటర్ పెట్టిన. 18 వేల కోట్లు రైతుల ఖాతాలో వేశాం. కేటీఆర్? తప్పుడు మాటలు మానుకో మాది ప్రజా పాలన రైతులకు..ప్రజలకు అందుబాటులో ఉన్నాం. రోజూ మేము 18 గంటలు ప్రజల మధ్యనే ఉంటున్నాం. ధర్నా చేయాల్సిన అవసరం ఏముంది. ప్రజల్ని పట్టించుకోకుండా ఉన్నారు మీరు. కాకుల లెక్క.. గద్దల లెక్క పిక్కుతున్నది వీళ్లే కదా. కేటీఆర్..హరీష్ లాంటి సన్నాసులు కదా మిమ్మల్ని దోచుకుంది. వాళ్ళు మిమ్మల్ని మోసం చేయడానికి వస్తున్నారు. పదేళ్లలో మీరు ఎంత మాఫీ చేశారు.. మేము ఎంత చేశామో చర్చకు సిద్దం. నెక్టు మా జగ్గన్న నే చూసుకుంటారు. సోషల్ మీడియా నీ నమ్ముకున్న మోడీ ఏమయ్యారు. మీరు అంతే ఐతరు 400 గెలుస్త అని మోడీ ప్రచారం చేసుకున్నారు.. ఏమైంది. వచ్చే ఎన్నికల్లో 39 లో 9 కూడా రావు' అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఇకపోతే రూ.2 లక్షల రుణమాఫీకి కాంగ్రెస్ ప్రభుత్వం వందశాతం కట్టుబడి ఉందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. బీఆర్ఎస్ సన్నాసుల మాటలు నమ్ముకొని రైతులు ఆగం కావద్దని సూచించారు.

# పశ్చిమాసియాలో సంక్షోభాలు ఆందోళనకరం

**యుద్ధక్షేత్రంలో సమస్యకు పరిష్కారం లభించదు**
**పోలండ్ ప్రధాని డొనాల్డ్ టస్క్‌తో భేటీలో ప్రధాని మోడీ**



వార్సా,ఆగస్ట్23 : ఉక్రెయిన్‌తో పాటు పశ్చిమాసియాలో కొనసాగుతున్న సంక్షోభాలు తీవ్ర ఆందోళనకరమని భారత ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. యుద్ధక్షేత్రంలో సమస్యకు పరిష్కారం లభించదన్న ఆయన.. చర్చలు, సంప్రదింపుల ద్వారా ఈ ప్రాంతాల్లో సాధ్యమైనంత త్వరగా శాంతి, స్థిరత్వం పునరుద్ధరణకు తాము మద్దతు తెలుపుతామన్నారు. పోలండ్ ప్రధాని డొనాల్డ్ టస్క్‌తో భేటీ అయిన తర్వాత మీడియాకు విడుదల చేసిన సంయుక్త ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఉక్రెయిన్, పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధాలు మనందరికీ తీవ్ర ఆందోళనకరం. యుద్ధక్షేత్రంలో ఏ సమస్యకు పరిష్కారం దొరకదని భారత్ బలంగా విశ్వసిస్తుంది. ఏ సంక్షోభంలోనైనా సామాన్యులు ప్రాణాలు కోల్పోవడం యావత్ మానవాళికే అతిపెద్ద సవాల్. చర్చలు, దౌత్యంతోనే శాంతి, స్థిరత్వానికి మేం మద్దతిస్తాం. ఇందుకోసం మిత్రదేశాలతో కలిసి అన్నిరకాల మద్దతు ఇచ్చేందుకు భారత్ సిద్ధంగా ఉంది' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా పోలండ్ వెళ్లిన ప్రధాని మోదీ ఆ దేశ ప్రధాని డొనాల్డ్ టస్క్‌తో భేటీ అయ్యారు. ఈసందర్భంగా ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేయడంపై చర్చించామని.. ఇరుదేశాలు తమ సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్యంగా మార్చుకోవాలని నిర్ణయించుకున్నామన్నారు. రష్యా దండయాత్ర సమయంలో భారత విద్యార్థుల తరలింపునకు పోలండ్ ఎంతో సహకరించిందని, అందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు. అంతకుముందు అక్కడి ప్రధానమంత్రి కార్యాలయం 'ఛాన్సలరీ'లో ప్రధాని మోదీకి ఘనస్వాగతం లభించింది. 'భారత్-పోలండ్ భాగస్వామ్యంలో సరికొత్త మైలురాయి. వార్సాలోని ఫెడరల్ ఛాన్సలరీలో భారత ప్రధానికి పోలండ్ ప్రధాని డొనాల్డ్ టస్క్ ఘనస్వాగతం పలికారు. 45 ఏళ్ల అనంతరం భారత ప్రధాని పోలండ్‌లో చేపట్టిన ఈ పర్యటన ఇరుదేశాల భాగస్వామ్యానికి సరికొత్త ఊపునిస్తుంది' అని భారత విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ పేర్కొన్నారు. ఈ విషయంపై పోలండ్ ప్రధాని టస్క్ స్పందిస్తూ.. ' చివరకు, 45ఏళ్ల అనంతరం.. భారత ప్రధానిని వార్సాలో చూడటం సంతోషంగా ఉంది' అని ఎక్స్‌లో పోస్టు చేశారు. భేటీలో భాగంగా పలు అంశాలపై ఇరువురు చర్చలు జరిపారు. ఆ తర్వాత పోలండ్ అధ్యక్షుడు ఆండ్రెజ్ సెబాస్టియన్ దుడాతోనూ మోదీ భేటీ కానున్నారు. ప్రధాని మోదీ పోలండ్ పర్యటనలో భాగంగా భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్.. ఆ దేశ విదేశీ వ్యవహారాల మంత్రి రాడోస్లావ్ సికోర్స్కితో భేటీ అయ్యారు. ఉక్రెయిన్ సంక్షోభం,ఇండో-పసిఫిక్‌లోద్వైపాక్షిక సహకారంపై చర్చించినట్లు ఎస్.జైశంకర్ పేర్కొన్నారు.

## తెలంగాణలో గ్రూప్-2 పరీక్షలకు కొత్త షెడ్యూల్

**డిసెంబర్ 15, 16 తేదీల్లో పరీక్షల నిర్వహణ**

హైదరాబాద్,ఆగస్ట్23 తెలంగాణలో గ్రూప్-2 పరీక్షలకు కొత్త షెడ్యూల్ వచ్చేసింది. డిసెంబర్ 15, 16 తేదీల్లో ఈ పరీక్షలు నిర్వహించనున్నట్లు టీజీపీఎస్సీ గురువారం ఓ ప్రకటనలో వెల్లడించింది. తొలుత ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ పరీక్షలు ఆగస్టు 7, 8 తేదీల్లోనే జరగాల్సి ఉంది. కానీ, డీఎస్సీ, గ్రూప్ -2 పరీక్షల మధ్య వారం రోజులు మాత్రమే వ్యవధి ఉండటంతో ఈ పరీక్షలను వాయిదా వేయాలంటూ అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో గ్రూప్ 2 పరీక్షలను డిసెంబర్‌కు రీషెడ్యూల్ చేస్తున్నట్లు ప్రకటించిన టీజీపీఎస్సీ.. తాజాగా పరీక్షల షెడ్యూల్‌ని విడుదల చేసింది. మొత్తం 783 గ్రూప్- 2 పోస్టులకు 5.51లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. కొత్త షెడ్యూల్ ప్రకారం.. రెండు సెషన్లలో పరీక్ష నిర్వహించనున్నారు. ఉదయం 10గంటల నుంచి 12.30గంటల వరకు ఒక సెషన్, మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5.30గంటలవరకు రెండో సెషన్‌లో పరీక్షలు జరుగుతాయని టీజీపీఎస్సీ కార్యదర్శి డా.ఇ. నవీన్ నికోలస్ వెల్లడించారు. ఈ పరీక్షలు ప్రారంభానికి వారం రోజుల ముందునుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు.-

## రుణమాఫీ లేదు కానీ రైతులతో రణం చేస్తున్నారు: హరీష్ రావు

**ప్రజలను శిక్షించవద్దని ఆ భగవంతుని వేడుకున్నా: హరీష్ రావు**
**రైతులందరికీ రుణమాఫీ పూర్తి అయ్యే వరకు మా పోరాటం ఆగదు..**
**రైతు రుణ మాఫీపై ప్రభుత్వం వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలి..**
**యాదాద్రి లక్ష్మి నరసింహస్వామి వారిని దర్శించుకున్న అనంతరం**
**విలేకరులతో మాజీ మంత్రి హరీష్ రావు**



యాదాద్రి భువనగిరి: అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలని, వెంటనే రైతుల రుణ మాఫీపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని బిఆర్ఎస్ నేత, సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గం యాదాద్రి శ్రీ లక్ష్మి నరసింహస్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం యాదగిరిగుట్ట లోని హరిత టూరిజం హోటల్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను అక్రమ కేసులతో వేధిస్తున్నారని మండిపడ్డారు. రైతుల రుణం మాఫీ చేయకుండా రైతులతో రణం చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరి రైతుకు రుణ మాఫీ జరిగేంతవరకు రైతులకు అండగా ఉంటామన్నారు. పోలీసులు కూడా చట్టానికి లోబడి పనిచేయాలన్నారు. పథకాలతోపాటుఅసెంబ్లీఎన్నికల్లో రైతు రుణ మాఫీ పేరుతో పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలనుఓట్లు అడిగి మోసం చేశారని మండిపడ్డారు.గత అసెంబ్లీ ఎన్నికల్లో రేవంత్ రెడ్డి పాపంచేసిముఖ్యమంత్రి పదవి సొంతం చేసుకున్నారని, రేవంత్ పాపం చేస్తే..దేవుడుప్రజలనుశిక్షించవద్దని, శ్రీ లక్ష్మి నరసింహ స్వామిని వేడుకున్నామని ఆయన అన్నారు. రేవంత్ రెడ్డి దైవ ద్రోహానికి పాల్పడ్డారని, సీఎం ఒకలా, మంత్రులు మరోలా రుణమాఫీపై ప్రకటనలు వాళ్ళ చిత్తశుద్ధికి నిదర్శనమని చురకలంటించారు.

# సామాజిక వివాదాల సత్వర పరిష్కారానికి కమ్యూనిటీ మీడియేటర్లు కృషి

**హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే వర్చువల్ విధానంలో శిక్షణ కార్యక్రమం ప్రారంభించిన సీ.జే**
**పైలెట్ ప్రాజెక్ట్ గా నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలో అమలు**













నిజామాబాద్, ఆగస్టు 22(లోకంతీరు) : సామాజిక వివాదాల సత్వర పరిష్కారంలో కమ్యూనిటీ మీడియేటర్లు క్రియాశీలక పాత్ర పోషిస్తారని రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే ఆకాంక్షించారు. మధ్యప్రదేశ్ లోని ఇండోర్ లో తొలిసారిగా2021లో కమ్యూనిటీ మీడియేటర్ వ్యవస్థను ప్రవేశపెట్టి సత్ఫలితాలు సాధించడంతో,దానిని స్ఫూర్తిగా తీసుకుని తెలంగాణ రాష్ట్రంలో తొలిసారిగా పైలట్ ప్రాజెక్ట్ కింద నిజామాబాద్, కామారెడ్డి ఉమ్మడి జిల్లాలలో కమ్యూనిటీ మీడియేటర్ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చారు. వివిధ సామాజిక వర్గాల నుండి కమ్యూనిటీ మీడియేటర్లుగా ఎంపిక చేసిన వారికి గురువారం నిజామాబాద్ జిల్లా కోర్టు సముదాయంలోని లీగల్ సర్వీసెస్ అథారిటీ సమావేశ మందిరంలో శిక్షణ తరగతులు ప్రారంభించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సమన్వయంతో రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 24 వరకు మూడు రోజుల పాటు కొనసాగనున్న ఈ శిక్షణ తరగతులను వర్చువల్ విధానం ద్వారా రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే లాంఛనంగా ప్రారంభించగా, హైకోర్టు న్యాయమూర్తులు సుజోయ్ పాల్, కె.సురేందర్, జె.శ్రీనివాస్ రావు భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే మాట్లాడుతూ, సామాజిక వివాదాలు, కుటుంబ తగాదాలు వంటి వాటిని కమ్యూనిటీ మీడియేటర్లు (వాలంటీర్లు) మధ్యవర్తిత్వం ద్వారా ఇరు వర్గాలకు ఆమోదయోగ్యమైన రీతిలో పరిష్కరించేందుకు కృషి చేయడం జరుగుతుందన్నారు. దీనివల్ల సామాజిక వివాదాలు క్షేత్రస్థాయిలోనే సత్వరం పరిష్కారమయ్యేందుకు ఆస్కారం ఉంటుందని అన్నారు.తద్వారాఅనవసర ఖర్చుతో పాటు, సమయం వృధా కాకుండా అరికట్టవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. సమాజంలోశాంతి, సామరస్యం నెలకొనేందుకు కూడా ఈ వ్యవస్థ దోహదపడుతుందని అన్నారు. శిక్షణ పొందిన వాలంటీర్లు తమతమ ప్రాంతాలలో కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్లను ఏర్పాటు చేసుకుని, పరస్పరం ఆమోదయోగ్యమైన రీతిలో వివాదాల పరిష్కారానికి చొరవ చూపాలని సూచించారు. పాటు నిర్వహించే శిక్షణ తరగతులను శ్రద్ధగా ఆకళింపు చేసుకుని, సమర్ధవంతంగా బాధ్యతలు నిర్వర్తించాలని, ప్రయోగాత్మకంగా అమలులోకి తెస్తున్న ఈ కార్యక్రమం సత్ఫలితాలు అందించేలా అంకితభావంతో కృషి చేయాలని కమ్యూనిటీ మీడియేటర్లకు హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ రిసోర్స్ పర్సన్, రిటైర్డ్ సెషన్స్ జడ్జి మొహమ్మద్ షమీమ్, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి పంచాక్షరీ, నిజామాబాద్ జిల్లా సెషన్స్ జడ్జి సునీతా కుంచాల, కామారెడ్డి సెషన్స్ జడ్జి వి.ఆర్.ఆర్.వరప్రసాద్, నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగేనవార్, న్యాయాధికారులు, రెండు జిల్లాలకు చెందిన కమ్యూనిటీ వాలంటీర్లు పాల్గొన్నారు.

# సంపాదకీయం

శుక్రవారం 23-08-2024


## వివాదాస్పదంగా మోడీ నిర్ణయాలు !

దేశవ్యాప్తంగా విపక్షాలు మోడీకి వ్యతిరేకంగా ఏ చిన్న అవకాశం వచ్చినా పోరాటానికి దిగుతున్నాయి. ఈ క్రమంలోనే దేశవ్యాప్తంగా గురువారం హిండెన్ బర్గ్ వెల్లడించిన నివేదికపై చర్యలకు కాంగ్రెస్ ఆందోళనకు దిగింది. ఆదానీ వ్యవహారంపై చర్చించాలని, జెపిసి వేయాలని పట్టుబడుతోంది. పార్లమెంట్ సమావేశాలు ముగిశాయో లేదో, ఆగస్టు 10న అదానీ స్టాక్ మార్కెట్ వ్యవహారంలో హిండెన్ బర్గ్ నివేదిక వెల్లడించిన తాజా అంశాలతో ప్రతిపక్షాలు మరింత రెచ్చిపోయాయి. అదానీ గ్రూప్ సంస్థలు తమ షేర్లను కృత్రిమంగా పెంచేందుకు ఉపయోగించిన విదేశీ నిధుల్లో సెబి చైర్మన్, ఆమె భర్తకు వాటాలు ఉన్నాయని వచ్చిన ఆరోపణల ఆధారంగా కాంగ్రెస్ దేశవ్యాప్త నిరసనలకు కాంగ్రెస్ పిలుపునిచ్చింది. ఈ ఆరోపణలపై జేపీసీ ఏర్పాటుకు డిమాండ్ చేసింది. అదే సమయంలో కులజనగణన. రిజర్వేషన్లపై కార్యాచరణ ప్రణాళికను ప్రకటించింది. మరో మూడు నెలల్లో జరగనున్న హర్యానా, మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికల నేపథ్యంలో ప్రతిపక్షాలు కమలనాథులను చీకాకు పెట్టేందుకు ఏ అవకాశాన్నీ వదులుకోకూడదని నిర్ణయించాయి. వీటిలో ఒక్క విషయంలో మాత్రం మోడీ వెనక్కి తగ్గారు. మూడోసారి అధికారంలోకి వచ్చిన తరవాత కూడా దూకుడు రాజకీయాలు మొదలు పెట్టినన మోడీ ఏకపక్ష నిర్ణయాలతో సాగుతున్నారు. దీంతో ఇప్పుడు ఒక్క విషయంలో మాత్రం వెనక్కి తగ్గక తప్పలేదు. అదికూడా సొంత ఎన్‌డిఎ పక్షాల నుంచి వచ్చిన వ్యతిరేకత వల్లనే అని గ్రహించాలి. విపక్ష కాంగ్రెస్ వ్యతిరేకించినా పెద్దగా పట్టించుకోలేదు. కానీ సొంత పక్షాల నుంచి వ్యతిరేకత రావడంతో మోడీ తన నిర్ణయాన్ని మార్చుకున్నారు. రాజకీయాల్లో అదును చూసుకుని ఎదురు దాడులు చేయడం మాత్రమే కాదు, అవసరమైనప్పుడు వెనక్కు తగ్గడం కూడా అవసరం. మోడీ ఇప్పుడు ఈ విధానం అవలంబించినా.. నమ్మడానికి లేదు. ఎందుకంటే పదేళ్లుగా మోడీ ఎదురులేకుండా రాజ్యమేలారు. కేంద్ర మంత్రిత్వ శాఖల్లో మధ్యస్థాయి పోస్టుల్లో సివిల్ సర్వీసు అధికారులను కాకుండా బయటి నుంచి వ్యక్తులను నియమించేందుకు యుపిఎస్‌సి ప్రకటన విడుదల చేసిన మూడు రోజుల్లోనే మోదీ సర్కార్ తన నిర్ణయాన్ని మార్చుకుంది. దాదాపు 45 జాయింట్ సెక్రటరీలు, డైరెక్టర్లు, డిప్యూటీ డైరెక్టర్లను నియమించేందుకు యుపిఎస్‌సి ప్రకటన చేసిన వెంటనే కాంగ్రెస్‌తో పాటు బీజేపీ మిత్రపక్షాలు కూడా విరుచుకుపడడంతో వెనక్కి తగ్గని పరిస్థితి ఏర్పడింది. ఈ నిర్ణయం రాజ్యాంగం కల్పించిన దళితులు, ఓబీసీలు, ఆదివాసీల రిజర్వేషన్లకు వ్యతిరేకమని లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ తీవ్రంగా విమర్శించారు. బయటి వ్యక్తులను నియమించడం యుపిఎస్‌సి పరీక్షలకు సిద్ధమవుతున్న ప్రతిభావంతులైన యువకుల హక్కులను దోపిడీ చేయడమేనని, అణగారిన వర్గాలకు సామాజిక న్యాయం లభించకుండా చేసేందుకే ఈ నియామకాలు చేస్తున్నారని రాహుల్ ధ్వజమెత్తారు. ఎన్డీఏ మిత్రపక్షాలు జనతాదళ్ (యు), లోక్ జనశక్తి (రాంవిలాస్) కూడా ఈ నిర్ణయాన్ని వెనక్కు తీసుకొమ్మని కోరాయి. అయితే టిడిపి లాంటి పార్టీలు దీనిని పట్టించుకోలేదు. చంద్రబాబు ఏ విషయంలోనూ ఇప్పుడు మోడీని విమర్శించదల్చు కున్నట్లుగా లేదు. అందుకే జిఎస్టీపైనా కూడా నోరు మెదపడం లేదు. మోడీ దృష్టిలో అనుంగు శిష్యుడుగా ఉండాలని కోరుకుంటున్నట్లుగా ఉంది. ఈ క్రమంలో మోడీ కాంగ్రెస్‌తో పాటు, సొంత కూటమి నేతలు కొందరు నిలదీయడంతో వెనక్కి తగ్గారు. రాజ్యాంగంలో పొందుపరిచిన సామాజిక న్యాయానికి అనుగుణం గా నియామకాలు జరగాలని అభిలషిస్తు న్నందువల్ల బయటినుంచి వ్యక్తుల నియామకానికి సంబంధించి ప్రకటన వెనక్కు తీసుకోవాలని కేంద్రమంత్రి జితేందర్ సింగ్ యుపిఎస్‌సి చైర్మన్‌కు లేఖ రాశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ మోడీ ఆదేశాల మేరకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు కూడా కేంద్రమంత్రి ప్రకటించారు. మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత భూసేకరణ బిల్లు, సాగు చట్టాలు, డేటా సంరక్షణ బిల్లు, బ్రాడ్ కాస్ట్ బిల్లుతో పాటు పలు నిర్ణయాలను వెనక్కు తీసుకోవల్సి వచ్చింది. బయటి వ్యక్తులను నియమించాలన్న విషయాన్ని కాంగ్రెస్ హయాంలో కూడా పరిశీలించారని, మోదీ ప్రభుత్వ నిర్ణయం సరైనదేనని బీజేపీ ఐటీ సెల్ కన్వీనర్ అమిత్ మాలవీయ రాహుల్‌ను విమర్శించిన రెండు రోజులకే ఆ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవడం గమనార్హం. త్వరలో ఎన్నికలు జరుగనున్న హర్యానాలో తమ విజయానికి ఓబీసీలు, దళితులపై పూర్తిగా ఆధారపడుతున్న బీజేపీ రాహుల్ విమర్శతో వెంటనే వెనక్కు తగ్గాల్సి వచ్చిందనడంలో సందేహం లేదు. అంతేగాకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకున్నా మిత్రులకు కోపం వస్తుందన్న భయం కూడా కొద్దిగా ఉండివుంటుంది. దేశంలో మాత్రమే కాదు, మోదీ ప్రభుత్వం అంతర్జాతీయంగా సవాళ్లు ఎదుర్కోవల్సి వస్తున్నది. బంగ్లాదేశ్‌లో తిరుగుబాటు తర్వాత ఆ దేశ ప్రధానమంత్రి హసీనాకు ఆశ్రయం కల్పించడం భారత్‌కు సమస్యాత్మకంగా పరిణమించింది. ఆమెను ఏ దేశానికి పంపించాలో తెలియక మనం సతమతమవుతుండగా యుద్ధ నేరాల క్రింద ఆమెను విచారించేందుకు బంగ్లా తిరిగి పంపాలని ఆ దేశం నుంచి డిమాండ్ వస్తోంది. ఇక అమెరికాలో అత్యంత కీలకమైన నాటో శిఖరాగ్ర సమావేశం జరుగుతున్న సమయంలోనే మోదీ రష్యాలో రెండు రోజులు పర్యటించి పుతిన్‌ను కౌగలించుకోవడం తీవ్ర విమర్శలకు దారి తీసింది. ఉక్రెయిన్‌పై రష్యా దాడి ప్రధానాంశంగా నాటో సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్న తరుణంలో మోదీ తన ఆయన తన నిర్ణయాన్ని మార్చుకోలేదు. మోదీ పుతిన్‌ను గాఢంగా కౌగలించుకున్న దృశ్యాలు విడుదలైన తర్వాత ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ కూడా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మొత్తంగా దేశీయంగా పలు ప్రజా సంక్షేమ నిర్ణయాలు తీసుకుంటే తప్ప మోడీ పట్ల మళ్లీ ఆదరణ పెరగదు. ఇదేవిధంగా మొండిగా పోతే మాత్రం మోడీ త్వరలోనే సమస్యలు ఎదుర్కోక తప్పదు.

# హరీష్ రావు సవాల్ భయంతోనే రుణమాఫీ మొదలుపెట్టారు :మాజీ ఎమ్మెల్యే సురేందర్

- × రూ. 2 లక్షలు వెంటనే అందరికీ రుణమాఫీ చేయాలి
- × ఎల్లారెడ్డిలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేసిన బిఆర్ఎస్ నాయకులు
- × కెసిఆర్ ప్రభుత్వంలో పుష్కలంగా నీళ్లు కరెంటు ఆనందంలో రైతులు
- × ఎల్లారెడ్డిలో ధర్నాలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే జాజుల సురేందర్







ఎల్లారెడ్డి ఆగస్టు 22 ( లోకం తీరు):- మూడు విడతలో రాష్ట్రంలో 40 శాతం మందికి రుణమాఫీ జరిగిందని అది కూడా హరీష్ రావు సవాల్ భయంతోనే సీఎం రేవంత్ రెడ్డి రుణమాఫీ మొదలు పెట్టారని ఎల్లారెడ్డి మాజీ శాసనసభ్యులు జాజుల సురేందర్ అన్నారు. గురువారం ఎల్లారెడ్డి మండల కేంద్రంలో రైతులు టిఆర్ఎస్ నాయకులు తలపెట్టిన ధర్నా కార్యక్రమానికి అయినా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల సంక్షేమం పట్టదని సీఎం రేవంత్ రెడ్డి పూటకో మాట మాట్లాడుతున్నారని అన్నారు. ఎన్నికల ముందు అర్హులైన ప్రతి రైతుకు రెండు లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ గద్దెనెక్కినంక రైతులను నిలువున మోసం చేసిందని అన్నారు. రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను దారుణంగా మోసం చేసిందని మండిపడ్డారు. రేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకుని రుణమాఫీ విషయంలో రైతులను మోసం చేసిన రాష్ట్ర ప్రభుత్వ తీరును ఎండగట్టేందుకు ఎల్లారెడ్డి నియోజకవర్గ ప్రజలు ప్రభుత్వానికి నిలదీయాలన్నారు. హరీష్ రావు సవాల్ భయంతోనే రుణమాఫీ మొదలు పెట్టారన్నారు. ఖమ్మం సభలో పూర్తిస్థాయిలో రుణమాఫీ జరిగిందని అనడం సీఎం రేవంత్ రెడ్డి తెలివితక్కువ తనానికి నిదర్శనం అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాటిమాటికి మాట మార్చి రైతులను మోసం చేస్తుందని రుణమాఫీ మీద సరైన అవగాహన లేని మంత్రులతో నిన్నటికి నిన్న ఆర్థిక శాఖ మంత్రి డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క ?7వేల కోట్లు మాత్రమే రుణమాఫీ జరిగిందని ఇంకా 15 వేల కోట్లు జరగాల్సి ఉందని అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రుణమాఫీ కాక అందులో ఉన్న లక్షలాది మంది రైతులకు అండగా ఉంటామన్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన రైతు పట్ల ఈ ప్రభుత్వం చిన్న చూపు చూస్తూనే ఉందని కెసిఆర్ హయంలో రైతులు ఆనందంగా ఉన్నారని చెప్పారు. పంటలు పండించేందుకు రైతులకు కనీసం సాగునీరు కూడా అందించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందని వెంటనే పూర్తిగా రుణమాఫీ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు జలంధర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు సతీష్, నాగిరెడ్డిపేట్ మండల మాజీ జడ్పిటిసి సభ్యులు మనోహర్ రెడ్డి, ఎల్లారెడ్డి సొసైటీ అధ్యక్షులు ఎగుల నర్సింలు, పటేల్ సాయిలు,గాంధారి, లింగం పెట్,నాగిరెడ్డి పెట్ మండలాల పార్టీ అధ్యక్షులు గుర్రాల సిద్దయ్య, డివిటీ రమేష్, శివాజీ రావు, కపిల్ రెడ్డి, బలరాం నాయక్, శ్రీనివాస్ నాయక్, ప్రేమ్, కౌన్సిలర్ ఎరుకల సాయిలు, నాయకులు శ్రవణ్ కుమార్, బబ్ల్యూ, సుదర్శన్, దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌ది..చిత్తశుద్ది లేని రుణమాఫీ

### జిల్లాల్లో రుణమాఫీపై వివక్ష చూపారు
### సత్తుపల్లిలో ధర్నా చేపట్టిన సండ్ర

ఖమ్మం,ఆగస్ట్23(ఆర్ఎన్ఎ: కీర్తి వస్తే వాళ్ళది.. అపకీర్తి వస్తే మాదని అన్నటు చేస్తున్నారు ఈ మంత్రులు అని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి అంబేద్కర్ సెంటర్ వద్ద సండ్ర వెంకట వీరయ్య ఆధ్వర్యంలో రైతు ధర్నా చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రుణమాఫీ అందరికి అమలు చేయ్యాలని డిమాండ్ చేస్తూ రైతులు బీఆర్ఎస్ నాయకులతో కలిసి ధర్నాలో పాల్గొన్నారన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన రుణామాఫీ చిత్తశుద్ధి లేని రుణమాఫీ అని తెలిపారు. ఎంత మందికి రుణామాఫీ ఇవ్వలో శాస్త్రీయంగా లేక్కలు లేకుండా చేశారన్నారు. రైతు లు రుణాలు తీసుకుంటే పై ఉన్న వడ్డి చేల్లిస్తేనే రుణా మాఫీ అవుతుందని ఇప్పుడు అంటున్నారని మండిపడ్డారు. అనేక సంకేతిక కారణాలు చెబుకుంటూ కాలం వెల్లబుచ్చుతున్నారన్నారు. గత పది సంవత్సరాలు అదే రైతులు అదే ఎకౌంట్స్ ఉన్నాయి అప్పుడు లేని సంకేతిక కారణాలు ఇప్పుడు ఎందుకు వస్తున్నాయి. ఎన్నికల్లో ప్రతి రైతుకు రుణామాఫీ అన్నారు..ఇప్పుడు అంక్షలు పెడుతున్నారు. 4000 కోట్లు వృద్దుల పెన్షన్ అపారన్నారు. విధి విధానాలు లేకుండా స్పష్టమైన రుణామాఫీ ఇవ్వడం లేదని మండిపడ్డారు. రాజకీయంగా రుణామాఫీ చేశాం అని అనిపించుకోవాటానికే రుణా మాఫీ చేశారా?.? రుణామాఫీ ని నుండి రైతులకు విముక్తి కల్పించటానికి చేశారా?? అని ప్రశ్నించారు. జిల్లాలో రుణామాఫీపై వివక్ష నెలకొందన్నారు. ఎన్నికల్లో రెండు నెలలు ముందు పార్టీ లోకి పోయ్యారన్నారు. ఇప్పుడు ఉన్న జిల్లాలో ఇద్దరు మంత్రులు గత బిఆరెస్ ప్రభుత్వంలో పని చేసిన వాళ్ళే ప్రభుత్వ పథకాలు అమలు చేసిన వాళ్ళే అన్నారు. ఇప్పుడు రెండు నెలలు ముందు పార్టీ మారీ పదువులు అనుభవిస్తున్నారన్నారు. అప్పుడు బీఆర్ఎస్ ను పొగిడిన వాళ్ళే ఇప్పుడు తిడుతున్నారు..ఈ జిల్లాలో ఉన్న మంత్రులన్నారు. కీర్తి వస్తే వాళ్ళది అపకీర్తి వస్తే మానది అన్నటు చేస్తున్నారు ఈ మంత్రులని మండి పడ్డారు. వృద్దులకు ఇవ్వాల్సిన పెంక్షన్ డబ్బులు ఆపి వేరే విధంగా ఉపయోగిస్తున్నారు.ఇలా చెయ్యటం మంచి పద్దతి కాదన్నారు. చివరకు రైతు వరకు న్యాయం జరిగే వరకు ఆందోళ ఆగాదు. ఇది అంతం కాదు ఆరంభమే అన్నారు.ఊజీసతిబర ఖీజీనీ: రైతు రుణ మాఫీ పై ప్రభుత్వం శ్వేతవత్రం విడుదల చేయాలి..సీతారామ ప్రాజెక్టు హడావుడి గా చేశారు ఇప్పుడు నీళ్ళు వస్తున్నాయా? అని ప్రశ్నించారు. కేసిఆర్ చేసిన సీతారామ ప్రాజెక్టు ను వాళ్ళ గొప్పగా చెప్పుకుంటున్నారు.. సీతారామ ప్రాజెక్టు పై అప్పట్లో కేసిఆర్ ను పొగిడిన నోళ్ళే ఇప్పుడు విమర్శలు చేస్తున్నారు? రైతులకు న్యాయం జరిగేలా పోరాటం చేద్దామన్నారు. శాంతియుతంగా న్యాయం కోసం పొరడదామన్నారు. వంద రోజుల్లోనే ఆరు గ్యారెంటీలు అమలు చేస్తాం --అని అన్నారు. నెలలు గడుస్తున్న ఎలాంటి ఉసు లేదని మండిపడ్డారు. కౌలు రైతులకు రైతు బందు అన్నారు అసలు రైతులకే దిక్కు లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక తెలంగాణలో పెళ్ళిళ్ళు కాలేదా?.తులం బంగారం ఎమైంది..? అని ప్రశ్నించారు. ఆకాశమే హద్దుగా హమిలు ఇచ్చి విస్మరించారు. ప్రభుత్వ అధికారులను భాగస్వామ్యం చేసి రుణామాఫీ కానీ రైతులను గుర్తించి కారణాలు తెలిసుకొని చివర రైతు వరకు రుణామాఫీ వర్తించేలా చేయ్యాలన్నారు. ప్రశ్నిస్తే రైతులు మూర్ఖులని అంటున్నారు..కేంద్రాని రాహుల్ గాంధీ ప్రశ్నించటం లేదా అన్నారు. కేంద్రంలో మీకు ప్రశ్నించే హక్కు ఉందో రాష్ట్రం లో మాకు ఉందన్నారు. ప్రశ్నిస్తే ఆవహేళన చేస్తారా? అర్హత కలిగిన రైతంగాన్ని రుణామాఫీ వెంటనే చెయ్యాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

# తెలంగాణలో మాటల మంటలు

హైదరాబాద్, ఆగస్టు 22, (న్యూస్ పల్స్) తెలంగాణ రాజకీయాల్లో మాటలు కోటలు దాటుతున్నాయి. నేతలు నిగ్రహం కోల్పోతున్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నేతలు ఇంకా తాము ప్రతిపక్షంలోనే ఉన్నామన్నట్లు వ్యవహరిస్తుండగా, అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ నేతలు తాము ఇంకా అధికారంలో ఉన్నామన్న భావనలోనే అహంకారపూరితంగా మాట్లాడుతున్నారు. ఈధోరణి అధికార పార్టీ నేతల్లో మరింత అసహనం పెంచుతోంది. అధికారంలో లేకపోయినా అధికారంలో ఉన్న నేతలను దూషించడాన్ని సహించలేకపోతున్నారు. దీంతో సీఎం రేవంత్‌రెడ్డే ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతలను అటాక్ చేస్తున్నారు. విపక్షంలో ఉన్నపట్టిలాగే దూకుడు ప్రదర్శిస్తున్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావును తన పదునైన మాటలతో చీల్చి చెండాడుతున్నారు. అధికారం చెప్పట్టినప్పటి నుంచి ఇదే దూకుడు కొనసాగిస్తున్నారు. మాజీ సీఎం కేసీఆర్ తన ప్రభుత్వాన్ని పడగొట్టి మళ్లీ అధికారంలోకి వసామని బెదిరించడంతో ముందుగా బీఆర్ఎస్ పార్టీనే [redacted] తయారయ్యారు. ముప్పు తిప్పలు పెడుతున్నారు. సబ్జెక్ట్, లెక్కల ఆధారంగా రేవంత్‌రెడ్డిని బలహీనపర్చేందుకు ప్రయత్నిస్తున్నారు. రేవంత్ రెడ్డికి కావలసింది కూడా అదే. లేకుంటే ప్రభుత్వం పరిష్కరించాల్సిన సమస్యల జాబితా కొండంత ఉంది. కేటీఆర్, హరీశ్‌రావుతో సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ మంత్రులు పోరాటాలు చేస్తూ ప్రజల దృష్టిని సమస్యలపై నుంచి మళ్లిస్తున్నారు. ఇక కేసీఆర్ ఫామ్‌హౌస్ నుంచి బయటకు రాకపోయినా, రేవంత్ రెడ్డి దూకుడు, వ్యూహాలను, వైఫల్యాలను నిశితంగానే గమనిస్తున్నారు. కవిత జైలు నుంచి బయటకు వచ్చేశాక కేసీఆర్ కూడా ఫామ్‌హౌస్ నుంచి బయటకు వచ్చి రేవంత్ రెడ్డి దూకుడుకి చెక్ పెడతారని తెలుస్తోంది. ఆ ప్రయత్నంలోనే కేసీఆర్ బీజేపీ పెద్దలతో తెర వెనుక రాయబారాలు నడుపుతున్నారని రేవంత్‌రెడ్డి స్వయంగా ఆరోపిస్తున్నారు. అంటే కేసీఆర్ వలన ప్రమాదం పొంచి ఉందని రేవంత్ రెడ్డి కూడా గ్రహించిన్నట్లు భావించవచ్చు. అందుకే కాంగ్రెస్ మంత్రులు కోరుకుంటున్న స్వేచ్ఛ, గౌరవం, ప్రాధాన్యత ఇస్తూ రేవంత్ రెడ్డి ఎవరూ పక్క చూపులు చూడకుండా జాగ్రత్తపడుతున్నారు.బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు చేతులు కలిపినా ఎదుర్కొనేలా రేవంత్‌రెడ్డి వ్యూహ రచన చేస్తున్నారు. అయితే అది అంత ఈజీ కాదంటున్నారు నిపుణులు. అందుకే ఇద్దరూ కలవకూడాదనే తరచూ కుమ్మక్కు ఆరోపణలు చేస్తున్నారు. ఒకవేళ కలిస్తే అప్పుడు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు సహకారం తీసుకోవాల్సి ఉంటుంది. ఈ విషయం కూడా రేవంత్ రెడ్డి చాలా ముందే పసిగట్టారని చెప్పవచ్చు. అందుకే చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టగానే అభినందనలు తెలిపి విభజన సమస్యలపై చర్చలకు ఆహ్వానించారని అనుకోవచ్చు. తెలంగాణ సీఎంగా రేవంత్ రెడ్డి ఉండటం చంద్రబాబు నాయుడుకి ఎంత ముఖ్యమో, అదేవిదంగా ఏపీ సీఎంగా చంద్రబాబు నాయుడుగా ఉండటం రేవంత్‌రెడ్డికి కూడా అంతే అవసరం. అప్పుడే వారు తమ ఉమ్మడి శత్రువులు జగన్, కేసీఆర్‌ను కట్టడి చేయగలుగుతారు. అందుకే రేవంత్ రెడ్డి కాస్త దూకుడుగానే ముందుకు సాగుతున్నారు. ఈ దూకుడు, వ్యూహాలు, అప్రమత్తం మాత్రమే సరిపోదు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, అవసరాలు, సమస్యలు తీర్చడం కూడా చాలా అవసరం.

# సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన మందకృష్ణ మాదిగ



హైదరాబాద్ : జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహతో కలిసి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగకలిశారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్యేలు వేముల వీరేశం, కవ్వంపల్లి సత్యనారాయణ, కాలె యాదయ్య, లక్ష్మీకాంతారావు, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, మాజీ ఎంపీ పసునూరి దయాకర్, తదితరులు కలిశారు.కాగా, ఎస్సీలలో ఉపవర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల ధర్మాసనం 6:1 మెజార్టీతో ఈ తీర్పు చెప్పింది. ధర్మాసనంలోని ఆరుగురు న్యాయమూర్తులు ఈ వర్గీకరణను సమర్థించగా, ఒకరు వ్యతిరేకించిన విషయం తెలిసిందే. దీంతో ఎన్నో ఏండ్లుగా వర్గీరణ కోసం పోరాడుతున్న సమస్యకు పరిష్కారం చూపినట్లుయింది.

# అదానీ అక్రమాలకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్నాం: సీతక్క



హైదరాబాద్: అదానీ వ్యవహారంపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేయాలని మంత్రి సీతక్క డిమాండ్ చేశారు. ప్రముఖ పారిశ్రామిక వేత్త అదానీపై హిండెన్ బర్గ్ ఆరోపణల నేపథ్యంలో దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ నిరసనలకు పిలుపునిచ్చింది. హైదరాబాద్‌లోని గన్‌పార్కు నుంచి ఇడి ఆఫీస్ కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సీతక్క మీడియాతో మాట్లాడారు. చిన్నాచితక లీడర్లపై ఇడి దాడులు చేస్తోందని, రూ. లక్షల కోట్ల అవినీతికి పాల్పడిన అదానీని ఇడి ఎందుకు విచారించలేదని ప్రశ్నించారు. అదానీ అక్రమాలకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్నామని సీతక్క స్పష్టం చేశారు. జెసిపి వేస్తేనే అక్రమాలు బయటకు వస్తాయన్నారు. బిజినెస్ రూల్స్ ప్రకారం వ్యాపారాలు చేస్తామని ఎవరు వచ్చిన తెలంగాణ ప్రభుత్వం రెడ్ కార్పెట్ వేస్తుందని తెలియజేశారు. ఈ ధర్నాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, కాంగ్రెస్ పార్టీ నేతలు పాల్గొంటారని పేర్కొన్నారు.

# విశ్వంలో అతిపెద్ద అంబేడ్కర్ విగ్రహం సందర్శన

హైదరాబాద్,ఆగస్ట్23 : తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి అధీనంలో సకల భారతీయుల భాగ్యవిధాత, ప్రపంచంలోనే అతిపెద్ద తొలి విగ్రహం డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ ను నిర్మించిన ఘనత పొందారు. అతి ఉత్తమ భవ్యదివ్యమైన విగ్రహం ఏర్పాటుకు మూల కారణం మూలవాసులైన బీసీ ఎస్సీ ఎస్టీలల్లో విపరీతంగా పెరుగుతున్న "బహుజన సైద్ధాంతిక ఆలోచన, కుల అస్తిత్వ చైతన్యం" అనేది జగమెరిగిన సత్యం. రాష్ట్రం లోనున్న బహుజనులు తమ ఎజెన్సీ ప్రాంతాల నుంచి, తండాల నుంచి, గ్రామాల నుంచి హైదరాబాద్ పట్టణం వెళ్ళారంటే ఆ భవ్య ఆకర్షణీయ అంబేడ్కర్ చిహ్నం చూడక మానరు. అట్టి స్మారక చిహ్నంలో తమ ఉజ్జ్వల భవిష్యత్తును చూసుకుంటారు. ఆయనను చూసిన వెంటనే ఆయన చెప్పిన మానవీయ సిద్ధాంతం, చూపిన మార్గాలపై నడవాలని మరింత స్ఫూర్తిని పొందుతారు. నిన్న "రక్షా బంధనం" పండుగ నిమిత్తంగా జిల్లా నిజమాబాద్ మోర్తాడ్ గ్రామానికి చెందిన ఓ కుటుంబం అట్టి విగ్రాహన్ని సందర్శించారు. ఈ మేరకు ముక్తిధాత బాబాసాహెబ్ కు ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం సమీపంలోని హుస్సేన్ సాగర్లో ఉన్న అంబేడ్కర్ గురువైన తథాగత్ గౌతమ బుద్ధుడి ఏకధంత శిల్పాన్ని కూడా సందర్శించారు.

## ఈ.డి కార్యాలయం ముందు టీపీసీసీ ఆధ్వర్యంలో భారీ నిరసన




కామారెడ్డి జిల్లా ఆగష్టు 22 లోకంతీరుఅదానీ కుంభకోణంపై దర్యాప్తు చేయడానికి జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జెపిసి)ని భారత జాతీయ కాంగ్రెస్ పదే పదే కోరింది. మొదట హిండెన్‌బర్గ్ నివేదిక ద్వారా బహిర్గతమైందని, ఆర్థిక మార్కెట్ నియంత్రణ సంస్థ అయిన ఎస్ ఈ బి ఐ యొక్క తీవ్రమైన రాజీకి తక్షణ చర్య అవసరమన్నారు.రోజురోజుకు కీలకమైన సమస్యపై మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ పరిస్థితి యొక్క తీవ్రతను నొక్కి చెబుతుంది. ఈ స్కామ్‌ను బీజేపీ ప్రభుత్వం కప్పిపుచ్చడానికి చేస్తున్న ప్రయత్నం తీరును నిరసిస్తూ గురువారం హైదరాబాద్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈ డి) కార్యాలయం ఎదుట టీపీసీసీ ఆధ్వర్యంలో భారీ నిరసనలు ప్రదర్శనలు ప్రదర్శించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మంత్రులు, కాంగ్రెస్ పార్టీ ఎం.ఎల్ ఏ లు, ఎంపీలు, రాష్ట్ర స్థాయి కాంగ్రెస్ పార్టీ నాయకులతో ఎల్లారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే మదన్ మోహన్ పాల్గొన్నారు

## మూడవ కల్లు డిపో పై... ఆరోపణలు అవాస్తవం.



నిజామాబాద్ ,ఆగస్టు 22(లోకంతీరు):నిజామాబాద్ నగరంలో గల మూడవ కల్లు గీత పారిశ్రామిక సహకార సంఘం పై పలువురు చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని భవానీ గీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు రవీందర్ గౌడ్ అన్నారు. గురువారం భవానీ గీత కార్మిక సంఘం కెసిఆర్ కాలనీలోని కార్యాలయం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అధ్యక్షుడు రవీందర్ గౌడ్, ఉపాధ్యక్షులు ఏ శ్రీనివాస్ గౌడ్, కోశాధికారి వి ఎల్ ఎన్ గౌడ్, డైరెక్టర్లు శ్యామ్, రాజగౌడ్, ట్యాపర్ సాయ గౌడ్ లు మాట్లాడుతూ.. గత కొన్ని రోజులుగా మా మూడవ కల్లు డిపో పై కొందరు అసత్య ప్రచారం చేస్తూ మా సభ్యులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. మా మూడవ డిపోలో 63 మంది ట్యాపట్లు, 400 పైన సభ్యులు ఉన్నారని వీరందరికీ ట్యాపర్లకు సంవత్సరానికి లక్ష చొప్పున, నాన్ ట్యాపర్లకు సంవత్సరానికి 18 వేలు మాముల చొప్పున గౌరవ వేతనం అందిస్తున్నామన్నారు. మా సంఘం బలోపేతంగా ఉందని లేనిపోని ఆరోపణలు చేస్తూ మా సంఘాన్ని మా సంఘ సభ్యుల మనోభావాలను దెబ్బతీసేవిధంగా మా సంఘంలో ఎలాంటి సభ్యత్వం లేనటువంటి వ్యక్తులు బురదజల్లే ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. మా సంఘాన్ని ఎలా చక్కబెట్టుకోవాలోమాకుతెలుసని బయట వారి ద్వారా చెప్పించుకునే స్థితిలో మేము లేమన్నారు. కొందరు వ్యక్తులను కల్లబొల్లి మాటలు చెప్పి మోసం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. మా సంఘంలో ఏ సభ్యునికైనా సమస్య ఎదురైతే సంఘం దృష్టికి తీసుకురావాలన్నది మా బైలాస్ లో రాసుకున్నామని, బైలా ప్రకారమే సంఘాన్ని కొనసాగిస్తూ, గత ఎనిమిదేళ్లుగా సంఘాన్ని బలోపేతం చేస్తూ, నిజామాబాద్ లో స్థిర పడ్డ వారికి కొత్త వారిని కూడా సభ్యత్వం ఇస్తూన్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో డిపో డైరెక్టర్లు శ్యాంసుందర్ గౌడ్, తిరుమలేష్ గౌడ్ , లాలా గౌడ్ , లక్ష్మణ్ గౌడ్, రాజ గౌడ్, సుభాష్ గౌడ్, ట్యాపర్లు సభ్యులు పాల్గొన్నారు.

## జిల్లా వ్యాప్తంగా రైతులతో నిరసనలు

### 2లక్షల మాఫీ అందరికీ వర్తించాలని డిమాండ్

నిజామాబాద్,ఆగస్ట్23 : రుణమాఫీ పేరిట రైతులను అరిగోస పెడుతున్న రేవంత్ సర్కారుపై బీఆర్ఎస్ పార్టీ సమరభేరి మోగించింది. అన్నదాతలకు అండగా, ఆంక్షలు లేని రుణమాఫీ అమలు కోసం నేడు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆందోళనలకు సిద్ధమైంది. గులాబీ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు గురువారం అన్ని మండల కేంద్రాల్లో ధర్నాలు చేపట్టారు. బాల్కొండ నియోజకవర్గంలో మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో, ఆర్మూర్ అంబేద్కర్ చౌరస్తాలో మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి నేతృత్వంలో ధర్నాలు నిర్వహించారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ధర్నాచౌక్‌లో మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా ఆధ్వర్యంలో, కామారెడ్డిలో మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ఆధ్వర్యంలో ధర్నా చేసారు. బాన్సువాడలో మాజీ ఎమ్మె ల్యే బాజిరెడ్డి గోవర్ధన్ నేతృత్వంలో, ఎల్లారెడ్డిలో మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్, జుక్కల్‌లో మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహించారు. కార్యక్రమాలకు పార్టీ ముఖ్య నేతలు, ప్రజాప్రతినిధులు హాజరు అయ్యారు. ఇదిలా ఉండగా రైతులకు మద్దతుగా చేపడుతున్న ధర్నాను అడ్డుకునేందుకు సర్కారు యత్నిస్తున్నదని మాజీమంత్రి వేముల ప్రశాంత రెడ్డి ఆరోపించారు. ధర్నాలో పాల్గొనవద్దని మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులకు పోలీసులు నోటీసులు జారీచేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల కోసం తలపెట్టిన ఆందోళన కార్యక్రమాలకు అన్నదాతలతో పాటు పార్టీ నేతలు, కార్యకర్తలు భారీగా తరలిరావడంతో కాంగ్రెస్ బండారం బయటపడిందన్నారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# సమయానికి బస్సులు లేక విద్యార్థుల ఆందోళన

### - డిపో మేనేజర్ కు వినతిపత్రం అందించిన కాంగ్రెస్ నాయకులు






కామారెడ్డి జిల్లా రాజంపేట ఆగష్టు 22 లోకంతీరు రాజంపేట మండలంలోని ఆర్గొండ గ్రామానికి గత పదిహేను రోజులుగా విద్యార్థుల కాలేజి సమయానికి బస్సులు రావడం లేదని గురువారం ఆర్గొండ గ్రామంలో కాలేజీ విద్యార్థులు ఆందోళన చేపట్టారు. విద్యార్థుల అభిప్రాయం మేరకు ఎల్లారెడ్డి శాసన సభ్యులు మదన్ మోహన్ రావు స్పందుంచి కామారెడ్డి ఆర్ టి సి డిపో మేనేజర్ కు చర వాణి ద్వారా కాలేజీ విద్యార్థులకు సమయానికి బస్సులు నడిపంచాలని చరవాణిలో తెలియజేసారు. ఈ సందర్భంగా మేనేజర్ స్పందించి కాలేజీ సమయానికి బస్సులు నడిపిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం డిపో మేనేజర్ కు రాజంపేట మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎర్ర ప్రణీత్ రెడ్డి వినతిపత్రాన్ని అందించారు.

# మహిళా శక్తి పై డిపియం, అడిషనల్ పీడీతో సమీక్ష సమావేశం - జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్





కామారెడ్డి జిల్లా ఆగష్టు 22 లోకంతీరు మహిళా శక్తి కార్యక్రమంపై గురువారం డిపిఎం, అడిషనల్ పిడి తో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్ ఎచ్ జి బ్యాంక్ లింకేజి ప్రోగ్రెస్ చాల తక్కువగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలాల వారిగా సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి పురోగతి సాదించాలని, లేకపక్షంలో చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.మిల్క్ ఎనిమాల్, బ్యాక్యర్డ్ పౌల్ట్రీ లక్ష్యం ప్రకారం గ్రౌండింగ్ చేయాలని ఆదేశించారు.మైక్రో ఎంటర్ప్రైజెస్ గ్రౌండ్ పైన రివ్యూ చేసారు. ప్రతీ రోజు గ్రౌండింగ్ ప్రోగ్రెస్ ఉండాలని లేదంటే చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆదేశించారు. అలాగే జిల్లాలో 5 మహిళా శక్తి క్యాంటీన్ 20 రోజుల్లో ప్రారంభించాలని ఆదేశించారు. తదనంతరం మీ సేవా కేంద్రాలు గుర్తింపు చేసారు. గ్రౌండింగ్ కూడా చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.రెగ్యులర్గా ఫీల్డ్ విజిట్ చేసి స్కీముల గ్రౌండింగ్ కు బ్యాంకులలో సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, అదనపు డిఆర్డిఓ మురళీ కృష్ణ, డిపిఎం లు రవీందర్ రావు, సుధాకర్, రమేష్ బాబు, వకుల పాల్గొన్నారు.

# జలల్ పూర్ లో రుణమాఫీ ఫిర్యాదుల స్పెషల్ డ్రైవ్







బాల్కొండ నియోజకవర్గం ప్రతినిధి ఆగస్టు 22 ( లోకంతీరు)తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రతి రైతు కుటుంబానికి రెండు లక్షల రూపాయల చొప్పున పంట రుణమాఫీ కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించి గత మూడు దఫాలలో రెండు లక్షల రూపాయల లోపల పంట రుణాలు కలిగి ఉన్న కుటుంబాలకు రుణమాఫీ చేపట్టడం జరిగిందని బాల్కొండ తహసిల్దార్ అడప శ్రీధర్ తెలిపారు. గురువారం రోజున రెవెన్యూ, వ్యవసాయ శాఖ మరియు పోలీసు శాఖ వారి సంయుక్త ఆధ్వర్యంలో జలాల్పూర్ లో రైతు రుణమాఫీకి సంబంధించి స్పెషల్ డ్రైవ్ నిర్వహించి రెండు లక్షల లోపు పంట రుణాలు కలిగి ఇంకా రుణ మాఫీ కాని రైతుల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి లావణ్య మాట్లాడుతూ వివిధ సాంకేతిక కారణాలవల్ల రెండు లక్షల రూపాయల లోపల పంట రుణాలు కలిగిన కొంతమంది రైతులకు రుణమాఫీ జరగలేదని అటువంటి వారి కోసం మండల కేంద్రంలో కూడా ఒక రుణమాఫీ ఫిర్యాదుల నమోదు కేంద్రాన్ని ప్రారంభించినట్టు తెలిపారు. భార్యా భర్తలు మరియు వారి మైనర్ సంతానమును కలిపి ఒక కుటుంబంగా పరిగణిస్తారు. కావున రెండు లక్షల రూపాయల లోపు లోన్ కలిగిన రైతు కుటుంబాలకు ఎవరికైనా రుణమాఫీ జరగనట్లయితే రుణమాఫీ ఫిర్యాదుల కేంద్రంలో అధికారులను సంప్రదించి దరఖాస్తులు సమర్పించాలని ఈ సందర్భంగా రైతులను కోరారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో బాల్కొండ ఎస్సై బీ నరేష్,ఎం ఆర్ ఓ శ్రీధర్,మండల వ్యసాయ అధికారిని లావణ్య,వ్యవసాయ విస్తరణ అధికారిని రేష్మ, మరియు రైతులు పాల్గొన్నారు.

# బదిలీపై వెళ్తున్న జిల్లా అధికారికి ఘనంగా సన్మానం




కామారెడ్డి జిల్లా ఆగష్టు 22 లోకంతీరు కామారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారినిగా పనిచేసిన భాగ్యలక్ష్మి బదిలీపై కరీంనగర్ జిల్లా వ్యవసాయ అధికారినిగా వెళ్ళినందుకు వ్యవసాయ అధికారులు, టీఎన్జీవోస్ ప్రతినిధులు గురువారం సన్మానం చేశారు. ఆమె కు పూలమాలలు వేసి, శాలువాలు కప్పి సన్మానించారు. ఇక్కడికి నిజామాబాద్ జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో డి డి ఏ గా పని చేసిన తిరుమల ప్రసాద్ కామారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి గా బదిలీపై రానున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీఎన్జీవోస్ అధ్యక్షుడు నరాల వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి సాయిలు, జిల్లా అధికారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాజారాం, ప్రతినిధులు నాగరాజు, సంతోష్ కుమార్, నర్సింలు, వ్యవసాయ అధికారులు, ఏఈవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆంధ్ర రాష్ట్రానికి మొదటి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు

### -నేడు ఆయన జయంతి

టంగుటూరి ప్రకాశం పంతులు 1872 ఆగష్టు 23న ఇప్పటి ప్రకాశం జిల్లా వినోదరాయునిపాలెము గ్రామంలో నియోగి బ్రాహ్మణులైన సుబ్బమ్మ, గోపాల కృష్ణయ్య దంపతులకు జన్మించాడు. సుప్రసిద్ధ స్వాతంత్ర్య సమర యోధుడు, ఆంధ్ర రాష్ట్రానికి మొదటి ముఖ్యమంత్రి. నిరుపేద కుటుంబంలో పుట్టి, వారాలు చేసుకుంటూ చదువుకుని, ఆంధ్ర రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి అయిన ధీరోదాత్తుడు టంగుటూరి ప్రకాశం పంతులు. 1940, 50లలోని



ఆంధ్ర రాజకీయాల్లో ప్రముఖంగా వెలుగొందిన వ్యక్తుల్లో ప్రకాశం ఒకడు. ప్రత్యేకాంధ్ర రాష్ట్ర సాధనలో నిర్ణాయక పాత్ర పోషించాడు. మద్రాసులో సైమన్ కమిషన్ వ్యతిరేక ప్రదర్శనలో తుపాకి కెదురుగా గుండెనుంచి ఆంధ్రకేసరి అని పేరు పొందినవాడు. 1921లో ఆంధ్ర ప్రాంతీయ కాంగ్రెసు కమిటీ అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. 1921 అక్టోబర్ 29 న స్వరాజ్య అనే దినపత్రికను ప్రారంభించాడు. కొద్ది కాలంలోనే, ఈ పత్రిక మంచి ఆదరణ చూరగొన్నది. దీని తెలుగు, తమిళ సంచికలకు ప్రజలు ఎగబడ్డారు. 1928లో మద్రాసులో సైమన్ కమిషను బహిష్కరణ ఉద్యమంలో పాల్గొని, తుపాకికి ఎదురు నిలిచి, కాల్చమని సవాలు చేసాడు. ఆయన ధైర్యసాహసాలకు మెచ్చి ఆంధ్ర ప్రజలు ఆయనకు ఆంధ్ర కేసరి అనే బిరుదునిచ్చి గౌరవించారు.1937లో కాంగ్రెసు అధికారంలోకి వచ్చినపుడు, రాజాజీ మంత్రివర్గంలో ఆయన రెవిన్యూమంత్రి అయ్యాడు. ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాడు. 1946లో మద్రాసు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఎన్నికై, 13 నెలలపాటు ఆ పదవిలో కొనసాగాడు. ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టాడు. స్వంతపార్టీలోని అంతర్గత రాజకీయాలకు ఆయన ప్రభుత్వం బలయ్యాక, పార్టీ నుండి బయటకు వచ్చి, స్వంతంగా ప్రజాపార్టీని స్థాపించాడు. రాజకీయాలనుండి వైదొలిగినా, ప్రకాశం చురుకుగా రాష్ట్రమంతటా పర్యటించాడు. అలాంటి ఒక ఒంగోలు పర్యటనలో వడదెబ్బకు గురై, నీరసించి హైదరాబాదులో ఆసుపత్రిలో చేర్పించబడ్డాడు. అక్కడే ప్రకాశం 1957, మే 20న పరమపదించాడు.

## కాంగ్రెస్ ప్రభుత్వం పతనం మొదలైంది : నిరంజన్ రెడ్డి



వనపర్తి : రైతులను రోడ్లపైకి తీసుకువచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పతనం మొదలైందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డిఅన్నారు. ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో చేపట్టిన రైతు ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల ముందు తప్పుడు హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ గెలిచాక అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ మాటలు నమ్మి మోసపోయామని ప్రజలు నేడు గుర్తిస్తున్నారని చెప్పారు.రుణమాఫీతో రైతుల ఆశలు ఆవిరి అయ్యాయి. తప్పుడు లెక్కలతో రుణమాఫీ చేయకుండా మాయ చేస్తున్నారని ఆరోపించారు. రైతులు తీసుకున్న రుణాలు, చేసిన మాఫీకి, ప్రభుత్వం చెబుతున్న లెక్కలకు ఎలాంటి పొంతన లేదని మండిపడ్డారు. కేసీఆర్‌ను నమ్మినంత వరకు రాష్ట్రంలో రైతులకు ఏ కష్టం రాలేదు. కాంగ్రెస్ మాటలతో ప్రజలు నిండా మునిగారన్నారు. రైతులే రుణమాఫీ మాట మారుస్తున్న రేవంత్‌రెడ్డి సర్కారు మెడలు వంచుతారన్నారు. రైతుల ఉద్యమానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

## విదేశీ గడ్డపై దేశ మాజీ ప్రధానులను విమర్శిస్తున్నారు : మోదీపై జైరాం రమేష్ ఫైర్




ప్రధాని నరేంద్ర మోదీ విదేశీ గడ్డపై దేశ మాజీ ప్రధానులను, ఆర్థిక విధానాలనం విమర్శిస్తున్నారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ ఆరోపించారు. విపక్ష నేత రాహుల్ గాంధీ విదేశాలకు వెళ్లిన ప్రతిసారీ దేశాన్ని విమర్శిస్తారని ప్రధాని మోదీ పదేపదే అసత్యాలు వల్లె వేస్తారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.ప్రధాని మోదీ పూర్తిగా అసత్యాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తాము అన్ని దేశాలతో సరైన సంబంధాలను నెరపుతామని, ఆయా దేశాల నుంచి సాయం కూడా పొందామని గుర్తుచేశారు. విదేశాలకు వెళ్లినప్పుడు రాహుల్ గాంధీ మన దేశంపై విమర్శలు గుప్పిస్తారని మోదీ పచ్చి అబద్దాలు చెబుతున్నారని, కానీ విదేశీ పర్యటనల్లో మోదీ చేస్తున్నదేంటని జైరాం రమేష్ నిలదీశారు.విదేశీ పర్యటనల్లో ప్రధాని మోదీ మన మాజీ ప్రధానులను, దేశ ఆర్థిక విధానాలను విమర్శిస్తుంటారని దుయ్యబట్టారు. 2014లో మోదీ అమెరికా పర్యటనలో మన మాజీ ప్రధానిని విమర్శించారని జైరాం రమేష్ గుర్తుచేశారు. కాగా, బీజేపీకి దీటైన పోటీ ఇస్తున్న పార్టీ కావడంతోనే కాషాయ పాలకులు నిత్యం కాంగ్రెస్‌ను లక్ష్యంగా చేసుకుంటున్నారని ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే అన్నారు. రాహుల్ గాంధీ ఒక్కరే బీజేపీకి ముచ్చెమటలు పట్టిస్తున్నారని అన్నారు.

# సినిమా తీరు

## నాగ చైతన్య 'హైదరాబాద్ బ్లాక్‌బర్డ్స్'

టాలీవుడ్ యువ నటుడు అక్కినేని నాగ చైతన్యకు రేసింగ్ అంటే ఎంత ఇష్టమో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఖరీదైన బైకులు, కాస్ట్లీ స్పోర్ట్స్ కార్లను కొనుగోలు చేయడంలో చైతు ముందుంటాడు. సినిమాలు లేదంటే రేసింగ్ కు సంబంధించిన అంశాలతో ఈ అక్కినేని హీరో చాలా బిజీగా ఉంటాడు. ఇక తన తాజా సినిమా 'తండేల్' తో బిజీగా ఉన్నప్పటికీ, ఆయన అభిమానులకు మరో అద్భుతమైన సర్‌ప్రైజ్ ఇచ్చారు.మోటార్‌స్పోర్ట్స్ పట్ల ప్రత్యేక ఆసక్తి కలిగిన చైతన్య,




ఇప్పుడు ఇండియన్ రేసింగ్ లీగ్ (ఐఆర్ఎల్) 2024లో హైదరాబాద్ బ్లాక్‌బర్డ్స్ అనే రేసింగ్ టీమ్‌కు యజమానిగా మారారు. ఈ సందర్భంగా నాగ చైతన్య మాట్లాడుతూ, "ఇండియన్ రేసింగ్ ఫెస్టివల్ (ఐఆర్ఎఫ్) కేవలం ఒక రేస్ మాత్రమే కాదు, నా మోటార్‌స్పోర్ట్స్ పట్ల ఉన్న ప్రేమను పంచుకోవడానికి ఒక మంచి అవకాశం. ఈ సీజన్‌లో హైదరాబాద్ బ్లాక్‌బర్డ్స్ టీమ్‌ని ముందుండి నడవడం నాకు చాలా సంతోషం కలిగిస్తుంది," అని పేర్కొన్నారు.ఆయన అభిమానులు మాత్రమే కాకుండా, రేసింగ్ ప్రపంచంలో కూడా ఈ నిర్ణయం చాలా ఆసక్తి రేకెత్తించింది. ఇప్పటికే హైదరాబాద్లో గౌర్మెట్ పాన్-ఏషియన్ వంటకాలను అందించే శోయు క్లౌడ్ కిచెన్ ద్వారా చైతన్య మంచి గుర్తింపు అందుకున్నాడు. ఇక నాగ చైతన్య లీడర్షిప్ లో హైదరాబాద్ బ్లాక్‌బర్డ్స్ ఒక బెస్ట్ రేసింగ్ టీమ్‌గా చరిత్రను సృష్టించేందుకు సిద్ధంగా ఉంది.మొత్తం ఆరు టీమ్‌లు పాల్గొనే ఈ లీగ్‌లో, హైదరాబాద్ బ్లాక్‌బర్డ్స్ ప్రేక్షకులను మరింత ఉత్సాహపరిచేలా ఉండనుందని అంచనాలు ఉన్నాయి. ఈ కొత్త పరిణామంతో, ఇండియన్ రేసింగ్ లీగ్‌పై మరింత ఆసక్తి పెరిగింది. నాగచైతన్య రాకతో హైదరాబాద్ బ్లాక్‌బర్డ్స్ టీమ్ మరింత ఉత్సాహంగా విజయవంతంగా ముందుకు సాగుతుందని భావిస్తున్నారు.ఇక నాగచైతన్య తండేల్ సినిమా పాన్ ఇండియా రేంజ్ లో రూపొందుతున్న విషయం తెలిసిందే. బన్నీ వాసు ఎంతో ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్న ఈ సినిమాకు చందు మొండేటి దర్శకత్వం వహిస్తున్నాడు. ఇక సినిమా షూటింగ్ ను వీలైనంత త్వరగా ఫినిష్ చేసి ఇదే ఏడాది డిసెంబర్ లో విడుదల చేయాలని అనుకుంటున్నారు. అలాగే నాగచైతన్య కు మరిన్ని ఆఫర్స్ వస్తున్నప్పటికీ పూర్తిగా తన ఫోకస్ మొత్తం తండేల్ పైనే పెట్టాడు. ఈ సినిమాతో ఎలాగైనా పాన్ ఇండియా మార్కెట్ లో తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు అందుకోవాలని చూస్తున్నాడు.

## 'మారుతి నగర్ సుబ్రహ్మణ్యం'.. సరైన టైమ్ లో బూస్ట్ ఇచ్చిన బన్నీ

ఆగస్టు నెలలో వచ్చిన చిన్న చిత్రాలకు బాక్సాఫీస్ వద్ద మంచి కలెక్షన్లు అందుతున్నాయి. ఈ నెల ప్రారంభంలో వచ్చిన 'ఆయ్' మరియు 'కమిటీ కుర్రోళ్ళు' చిన్న చిత్రాలుగా విడుదలై ప్రేక్షకులను ఆకట్టుకొని మంచి హిట్స్ గా నిలిచాయి. ఇప్పుడు అదే ట్రాక్ లో రాబోతున్న సినిమా 'మారుతి నగర్ సుబ్రహ్మణ్యం'. ఇది మరొక కామెడీ ఎంటర్టైనర్ కావడంతో మంచి అంచనాలను ఏర్పరచుకుంది.ముఖ్యంగా రావు రమేష్ ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రంపై హైప్ పెరగడానికి మరో కారణం అల్లు అర్జున్ సపోర్ట్. ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు బన్నీ హాజరై తన సపోర్ట్ ప్రకటించడమే కాకుండా, తన స్పీచ్ తో మరింత ఉత్సాహాన్ని పెంచాడు. అల్లు అర్జున్ ఈ వేడుకలో చేసిన ఉపన్యాసం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇష్టమైన వారి కోసం తాను ఎప్పటికప్పుడు ముందుకొస్తానని చెప్పిన బన్నీ, రావు రమేష్ సహా ఈ చిత్రానికి సంబంధించిన



నటీనటులు, సాంకేతిక నిపుణులను ప్రశంసించడం ప్రధాన ఆకర్షణగా నిలిచింది.బన్నీ ఇచ్చిన స్పీచ్ సోషల్ మీడియాలో ఎందరో ఫ్యాన్స్ ను ఆకర్షిస్తోంది. ముఖ్యంగా 'మారుతి నగర్ సుబ్రహ్మణ్యం' పై ఈ ప్రసంగం మరింత ఆసక్తి కలిగించిందని చెప్పవచ్చు. ట్రైలర్ ద్వారా ఇప్పటికే ఈ సినిమాపై పాజిటివ్ వైబ్రేషన్స్ క్రియేట్ అయ్యాయి. రావు రమేష్ ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రం ఒక కామెడీ మూవీగా రూపొందింది. రావు రమేష్ అకౌంట్ లో అకస్మాత్తుగా డబ్బులు క్రెడిట్ అవడం, ఆ పరిణామాల చుట్టూ కథ నడవడం ఆసక్తికరంగా ఉంటుందట.ఇందులో కామెడీ ఎలిమెంట్స్ చాలా బాగున్నాయని ట్రైలర్ తో ఒక నమ్మకాన్ని కలిగించారు. ఇటీవల కాలంలో తెలుగు ప్రేక్షకులు ఇలాంటి కామెడీ చిత్రాలకు మంచి సపోర్ట్ అందిస్తున్నారు. దీంతో, 'మారుతి నగర్ సుబ్రహ్మణ్యం' కూడా అదే లైన్లో విజయం సాధించవచ్చని అనిపిస్తోంది. ఈ సినిమా లక్ష్మణ్ కార్య దర్శకత్వంలో రూపొందింది. బుజ్జి రాయుడు పెంట్యాల, మోహన్ కార్య కలిసి నిర్మించిన ఈ చిత్రాన్ని పీబీఆర్ సినిమాస్, లోకమాత్రే సినిమాటిక్స్ నిర్మాణ సంస్థలు సంయుక్తంగా సమర్పిస్తున్నాయి.ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఈ సినిమాను థియేట్రికల్ హక్కులను కొనుగోలు చేసి గ్రాండ్ గా విడుదల చేయడానికి సిద్ధమయ్యారు. తబితా సుకుమార్ సమర్పణలో తొలి చిత్రంగా ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడం విశేషం. దర్శకుడు సుకుమార్ మరియు అల్లు అర్జున్ ఈ చిత్రానికి ముఖ్య అతిథులుగా రావడంతో మంచి క్రేజ్ ఏర్పడింది. ఇక సినిమాను ఈ నెల 23న గ్రాండ్ గా విడుదల చేయబోతున్నారు.

## బౌలరే కదా అని కొట్టిపారేసిన ఇంగ్లీషోళ్లు.. అరంగేట్రంలోనే 41 ఏళ్ల రికార్డ్ బ్రేక్.. బలైంది మనోడే



ఇంగ్లండ్‌తో జరుగుతోన్న తొలి టెస్టు మ్యాచ్‌లో అరంగేట్రం చేసిన మిలన్ రత్నాయక్ కొత్త చరిత్ర సృష్టించాడు. 9వ ర్యాంకులో బరిలోకి దిగి అద్భుతమైన ఆటతో ఆకట్టుకున్నాడు.మాంచెస్టర్‌లోని ఓల్డ్ ట్రాఫోర్డ్ మైదానంలో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో శ్రీలంక జట్టు టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది.అందుకు తగ్గట్టుగానే ఇన్నింగ్స్ ప్రారంభించిన శ్రీలంక జట్టు 113 పరుగులకే 7 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో చేరిన ధనంజయ డిసిల్వా, మిలన్ రత్నాయకే 63 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఆ తర్వాత ధనంజయ డిసిల్వా (74) వికెట్‌ను కోల్పోయాడు.మరోవైపు ఒంటరి పోరు కొనసాగించిన మిలన్ రత్నాయకే జట్టు స్కోరు 200 దాటించాడు. 135 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సర్లతో 72 పరుగులు చేశాడు. ఈ 72 పరుగులతో టెస్టు క్రికెట్‌లో మిలన్ రత్నాయక్ సరికొత్త చరిత్ర సృష్టించాడు.అంటే టెస్టు క్రికెట్ చరిత్రలో 9వ నంబర్‌లో అరంగేట్ర మ్యాచ్‌లో అత్యధిక పరుగులు చేసిన ప్రపంచ రికార్డు భారత్‌కు చెందిన బల్వీందర్ సంధు పేరిట ఉంది. బల్వీందర్ 1983లో పాకిస్థాన్‌పై 71 పరుగులు చేసి ప్రపంచ రికార్డు సృష్టించాడు.ఇప్పుడు 41 ఏళ్ల తర్వాత ఈ రికార్డును బద్దలు కొట్టడంలో మిలన్ రత్నయ్య సక్సెస్ అయ్యాడు. తొలి టెస్టు మ్యాచ్‌లో 9వ ర్యాంక్‌తో మైదానంలోకి వచ్చిన మిలన్ 72 పరుగులు చేసి బల్వీందర్ సంధు పేరిట ప్రపంచ రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. దీంతో టెస్టు క్రికెట్‌లో తొలి మ్యాచ్‌లోనే మిలన్ రత్నయ్య సరికొత్త చరిత్ర సృష్టించాడు.ఈ మ్యాచ్‌లో ధనంజయ డిసిల్వా (74), మిలన్ రత్నాయకే (72) హాఫ్ సెంచరీలతో 236 పరుగులకే ఆలౌటైంది. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇంగ్లండ్ జట్టు తొలి రోజు ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టపోకుండా 22 పరుగులు చేసింది. ప్రస్తుతం క్రీజులో బెన్ డకెట్ (13), డేనియల్ లారెన్స్ (9) బ్యాటింగ్ చేస్తున్నారు.

## ఛాంపియన్స్ ట్రోఫీలో టీమిండియా ఓపెనర్లుగా ఆ ఇద్దరే ఉండాలి: మాజీ ప్లేయర్

ఛాంపియన్స్ ట్రోఫీ 2025 ఫిబ్రవరి 19 నుంచి ప్రారంభమవుతుంది. పాకిస్థాన్ వేదికగా జరిగే ఈ టోర్నీలో టీమిండియాకు ఎవరు శుభారంభం ఇస్తారో దినేష్ కార్తీక్ చెప్పుకొచ్చాడు.ఎందుకంటే, వచ్చే ఛాంపియన్స్ ట్రోఫీ వన్డే ఫార్మాట్‌లో జరగనుంది. కాబట్టి, ఇక్కడ మంచి బ్యాటింగ్ కనబరిచే బ్యాట్స్‌మన్స్ ఓపెనర్‌గా బరిలోకి దిగాలి.అందుకే రోహిత్ శర్మతో కలిసి శుభమన్ గిల్ చాంపియన్స్ ట్రోఫీని ప్రారంభించాలని దినేష్ కార్తీక్ అన్నాడు. ఇక్కడ, హిట్‌మ్యాన్ తుఫాన్ బ్యాటింగ్ ఆకట్టుకుంటే, మరోవైపు గిల్ తన క్లాసిక్ బ్యాటింగ్‌తో దూసుకెళ్తుంటాడు. కాబట్టి ఈ జోడీని ఓపెనర్లుగా కొనసాగించడమే మంచిదన్న అభిప్రాయం డీకేలో ఉంది.అదే సమయంలో యశస్వి జైస్వాల్‌ను బ్యాకప్ ఓపెనర్‌గా ఎంపిక చేయాలని దినేష్ కార్తీక్ సూచించాడు. ఎందుకంటే, గిల్ ఆశించిన స్థాయిలో రాణించలేకపోతే జైస్వాల్‌ని రంగంలోకి దించడమే మేలు. యువ ఎడమచేతి వాటం బ్యాట్స్‌మన్ ఇప్పటికే తన సత్తా చూపించాడు. అందుకే, తాను కూడా జట్టులో ఉండాలని కోరుకుంటున్నట్లు క్రిక్‌బజ్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో దినేష్ కార్తీక్ తెలిపాడు.అ అలాగే, ఈ ప్రపంచకప్‌లో టీమిండియా ఫైనల్‌లోకి ప్రవేశించినందున, అదే జట్టును ఛాంపియన్స్ ట్రోఫీకి కూడా ఎంపిక చేయవచ్చు. ఇషాన్ కిషన్‌కు బదులుగా రిషబ్ పంత్‌కు అవకాశం ఇచ్చే అవకాశం ఉంది.2023 వన్డే ప్రపంచకప్ జట్టు: రోహిత్ శర్మ (కెప్టెన్), శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లీ, శ్రేయాస్ అయ్యర్, సూర్యకుమార్ యాదవ్, కేఎల్ రాహుల్ (వికెట్ కీపర్), ఇషాన్ కిషన్/రిషబ్ పంత్ (వికెట్ కీపర్), హార్దిక్ పాండ్యా, రవీంద్ర జడేజా, శార్దూల్ థాక్ పట్, కుల్దీప్ యాదవ్, జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ షమీ, మహ్మద్ సిరాజ్.




## కంటెంట్ మాత్రమే కింగ్ అన్న వర్మ!

సంచలనాల రాంగోపాల్ వర్మ తన సినిమాల్ని తప్ప ఇతర సినిమాల్ని రిలీజ్ కి ముందు ప్రమోట్ చేయరు. రిలీజ్ అయిన అనంతరం అవి హిట్ తో సంచలనమైతే తనదమైన మార్క్ ఫీడ్ బ్యాక్ ఇస్తారు తప్ప అంత వరకూ ఎలాంటి కామెంట్ చేయరు. అదీ సినిమా బాగుంటే పాజిటివ్ గా



స్పందిస్తారు..ఒక వేళ ఫ్లాప్ అయితే ఎలాంటి నెగిటివ్ కామెంట్ జోలికి వెళ్లరు. ఒకవేళ అలా వెళ్లారు? అంటే అది ఏ పూరి జగన్నాథ్ సినిమానో అయి ఉండాలి. ంఆఎఖీమొఇఓఇఔ పూరి తన ప్రియ శిష్యుడు కాబట్టి అతడి సినిమాలకే ఎక్కువగా స్పందిస్తుంటాడు. అయితే తాజాగా ఓ హారర్ థ్రిల్లర్ సినిమాని వర్మ ప్రమోట్ చేయడానికి రావడం విశేషం. కోలీవుడ్ సినిమా 'డీమాంటీ కాలనీ'కి సీక్వెల్ గా 'డిమాంటీ కాలనీ-2' తెరకెక్కిన సంగతి తెలిసిందే. తొలి భాగం తమిళ్ సహా తెలుగులోనూ మంచి విజయం సాధించింది. దీంతో రెండవ భాగాన్ని తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. ఈసినిమా ప్రీ రిలీజ్ వేడుక హైదరాబాద్ లో జరిగింది. ఈ వేడుకకు గెస్ట్ గా రాంగోపాల్ వర్మ హాజరయ్యారు. ఈసందర్భంగా నేడు ఎలాంటి సినిమాలు విజయం సాధిస్తున్నాయి? అన్న సంగతిని మరోసారి గుర్తు చేసారు. 'నేను 20 ఏళ్ల క్రితం 'భూత్' అనే సినిమా చేసా. అదంతా అపార్ట్ మెంట్ లోనే జరుగుతుంది. అది రిలీజ్ అయ్యాక చాలా మంది భయపడి అపార్ట్ మెంట్ లోకి వెళ్లడం మానేసారు. 'డీమాంట్ కాలనీ' రిలీజ్ అయ్యాక ఆ పేరు పెట్టినందుకు వివాదం అయిందని దర్శకుడు నాతో చెప్పారు. ఈరోజు సినిమాకి కేవలం కంటెంట్ మాత్రమే. కంటెంట్ ఉన్న చిన్న సినిమాలే పెద్ద విజయం సాధిస్తు న్నాయి.

## అందానికే మరో అందం....






## బ్లూ టీ.. గ్రీన్ టీ కన్నా బెస్ట్.. దీంతో అద్భుత ఆరోగ్య ప్రయోజనాలు!!

మనం నిజ జీవితంలో బ్లాక్ టీ గురించి, గ్రీన్ టీ గురించి విని ఉంటాం.. కానీ బ్లూ టీ గురించి విన్నారా.. బ్లూ టీ బటర్ ఫ్లై బఠాని ఫ్లవర్ అని పిలిచే బ్లూ క్లిటోరియా టెర్నెటా.. అదేనండి మనం నిత్యం చూసే శంకు పువ్వు తో తయారు చేసే టీనే బ్లూ టీ అంటారు. ఈ బ్లూ టీని ప్రతిరోజు తాగడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. ఆరోగ్యానిచ్చే బ్లూ టీ సహజంగా శంకు పుష్పం అనగానే దేవుడికి పూజ చేయడానికి ఉపయోగించే పువ్వు. శివుడికి, శ్రీమహావిష్ణువుకి ఇష్టమైన పువ్వు అని చెబుతారు. అయితే ఈ పువ్వు మనకు తెలియకుండానే మన ఆరోగ్యాన్ని కూడా కాపాడుతుందని ప్రతినిత్యం దీనిని టీగా చేసుకుని తాగడం వల్ల ఆరోగ్యవంతులుగా మారుతామని చెబుతున్నారు. మరి ఈ టీ ఎలా తయారు చేసుకోవాలో తెలుసుకుందాం. బ్లూ టీ తయారీ ఇలా నాలుగైదు శంకు పుష్పాలను తీసుకొని శుభ్రంగా కడుక్కొని ఒక గ్లాసు నీళ్లల్లో శంకు పుష్పాలను వేసి స్టవ్ పైన పెట్టి గ్లాసు నీళ్లు అయ్యేవరకు శంఖపుష్పాల యొక్క రంగు ఆ నీళ్లలో దిగే వరకు మరిగించాలి. ఆపై స్టౌ ఆఫ్ చేసి అందులో కాస్త నిమ్మరసం, తేనే కలిపి టీలాగా తీసుకుంటే ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. క్రమం తప్పకుండా దీనిని తీసుకోవడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను గురించి తెలుసుకుందాం. బ్లూ టీ ఆరోగ్యం విషయంలో చేస్తుంది అద్భుతాలు ఎవరైతే క్రమం తప్పకుండా శంకు పుష్పంతో తయారు చేసిన బ్లూ టీని తాగుతారో వారికి నరాల సంబంధితమైన సమస్యల నుంచి విముక్తి కలుగుతుంది. కళ్ళ రక్తనాళాలను శుద్ధి చేసి కంటి ఆరోగ్యాన్ని శంకు పుష్పాలతో తయారుచేసిన టీ మెరుగుపరుస్తుంది. మన మెదడు ఆరోగ్యాన్ని మెరుగుపరిచి జ్ఞాపక శక్తిని పెంచేందుకు దోహదం చేస్తుంది. దీనిలో పుష్కలంగా ఉండే యాంటీ ఆక్సిడెంట్లు చర్మ ఆరోగ్యాన్ని కాపాడి వృద్ధాప్యచాయలు త్వరగా రాకుండా చేస్తాయి. బ్లూ టీతో బీపీ, షుగర్ కంట్రోల్ చర్మ ఛాయను, ఆకృతిని కూడా మెరుగుపరుస్తాయి. బ్లూ టీ మన జుట్టు రాలడాన్ని తగ్గించి, జుట్టు తెల్లబడడాన్ని తగ్గిస్తుంది. జీర్ణక్రియకు ఎంతగానో సహాయపడుతుంది. రక్తంలో షుగర్ లెవెల్స్ ను నియంత్రిస్తుంది. బీపీని తగ్గిస్తుంది. గట్ హెల్త్ కు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇది క్యాన్సర్ కారకమైనటువంటి కణాలతో పోరాటం చేసి క్యాన్సర్ కణాలు ఎదుగుదలను నిరోధిస్తుంది. శరీరంలో వాపులను తగ్గిస్తుంది. బరువు, ఒత్తిడి కంట్రోల్ తలనొప్పి, మైగ్రేన్ తదితర సమస్యలకు ఉపశమనాన్ని ఇస్తుంది. ఇందులో ఉండే ఫ్రీ రాడికల్స్ కడుపులో మంట వంటి సమస్యలతో పోరాటం చేసి ఆరోగ్యాన్ని ఇస్తుంది. హై బీపీ ఉన్నవారికి ఇది దివ్య ఔషధం అని చెప్పాలి. ఇది శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ ను తగ్గించి మంచి కొలెస్ట్రాల్ ని పెంచుతుంది. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఇది గుండెపోటు ప్రమాదాలను తగ్గిస్తుంది. సహజసిద్ధమైన బ్లూ టీ బరువు తగ్గడానికి ఎంతగానో దోహదం చేస్తుంది. ఒత్తిడిని తగ్గించే గొప్ప లక్షణాలు కూడా బ్లూ టీ లో ఉన్నాయి.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY BYAGAL SRINIVAS, PRINTED AT S.S. PRINTERS & FILE MAKERS, PUS ALAGALLY, JAWAHAR ROAD, Town & Dist.NIZAMABAD- 503001, TELANGANA STATE, PUBLISHED AT H.NO: 6-11-174/1, NAMDEVWADA, Town & Dist. NIZAMABAD, TELANGANA STATE - 503001.EDITOR: BYAGAL SRINIVAS.